సమస్యలు పరిష్కరించాలని ఉపాధి కూలీల ధర్నా

హామీలు అమలు చేయాలని, జీవన భృతి ఇవ్వాలని నినాదాలు

లక్ష్మీదేవిపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

లక్ష్మీదేవిపల్లి, మార్చి 27 : అపరిష్కృతంగా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలు లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాల, జీవన భృతి రూ.12 వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐపీకేఎంఎస్ నాయకులు మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులకు జీవన భృతి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని ప్రకటించిన హామీని విస్మరించిందన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జాటోత్ కృష్ణ, బానోతు ధర్మ, వై.గోపాలరావు, రాజశేఖర్, రాయల సిద్ధు, కంచర్ల జ్యోతి, రేణుక, నిర్మల, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

'యువ వికాసం' పథకానికి దరఖాస్తుల ఆహ్వానం: కలెక్టర్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 27: జిల్లాలోని బీసీ, ఎంబీసీ, ఓసీ ఫెడరేషన్, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగులైన యువతీ యువకుల నుంచి రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు దీనిని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు.

'మున్సిపల్ కార్పొరేషన్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం'

సమావేశంలో పాల్గొన్న నాయకులు

కొత్తగూడెం టౌన్, మార్చి 27: మండలంలోని ఏడు పంచాయతీలను కొత్తగా ఏర్పాటుచేయనున్న మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిపే చర్యలను తాము వ్యతిరేకిస్తున్నామని సుజాతనగర్ పరిరక్షణ కమిటీ నాయకులు అన్నారు. సుజాతనగర్ సీపీఎం కార్యాలయంలో గురువారం పరిరక్షణ కమిటీ సమావేశంలో నాయకులు మాట్లాడారు. 'కార్పొరేషన్ వద్దు... పంచాయతీనే ముద్దు' అంటూ నినాదాలు చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థుల సత్తా

పతకాలు సాధించిన విద్యార్థులు

పాల్వంచ రూరల్, మార్చి 27: ఖమ్మానికి చెందిన నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో భాగంగా పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలకు కబడ్డీ, షటిల్, రన్నింగ్ పోటీలు, పురుషులకు వాలీబాల్, రన్నింగ్, షటిల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్వంచ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి పరంధామరెడ్డి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్రీరాం, నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం, అకౌంట్స్ ఆఫీసర్ కమర్తపు భానుచందర్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, పువ్వాడనగర్ జాగృతి యూత్ అసోసియేషన్ సయ్యద్‌షారుక్, కేసీఆర్ నగర్ యూత్ క్లబ్ బీ.మురళీకృష్ణ, జిల్లా యువసేన యూత్ క్లబ్ అధ్యక్షుడు బానోత్ వెంకట్ పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్‌లో కార్డన్ సెర్చ్

కార్డన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు చేస్తున్న డీఎస్పీ, సీఐ

పాల్వంచ, మార్చి 27: ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రశాంత్ నగర్ కాలనీలో గురువారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గంజాయి, అనుమానిత వ్యక్తులు, పత్రాలు లేని వాహనాల గురించి ఆరా తీసి తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 33 బైకులు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం వాటిని సంబంధిత వ్యక్తులకు అప్పగించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌నగర్ కాలనీ వాసులకు నూతన చట్టాలపై పోలీసులు అవగాహన కల్పించారు. గంజాయి, సైబర్ నేరాలు, బెట్టింగ్‌లకు యువత దూరంగా ఉండాలని సూచించారు. సీఐ సతీశ్, పాల్వంచ ఎస్సైలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాజెక్టు క్రీడల్లో 'కేటీపీఎస్' ప్రతిభ


ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను అభినందిస్తున్న సీఈలు

పాల్వంచ, మార్చి 27: భూపాలపల్లి కేటీపీపీలో ఇటీవల జరిగిన టీజీ జెన్కో ఇంటర్ ప్రాజెక్టు షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన కేటీపీఎస్ క్రీడాకారులను సీఈ శ్రీనివాస బాబు, ఎస్ఈ (సివిల్) యుగపతి గురువారం అభినందించారు. షటిల్ బ్యాడ్మింటన్ టీమ్ విభాగంలో కేటీపీఎస్ ఏడో దశ జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. ఓపెన్ సింగిల్స్ విభాగంలో భరద్వాజ్ విజేతగా నిలిచారు. ఓపెన్ డబుల్స్ విభాగంలో ఏడో దశకు చెందిన భరద్వాజ్, అనీల్‌కుమార్‌లు విజేతగా నిలిచారు. క్రికెట్‌లో కేటీపీఎస్ ఏడో దశ జట్టు తృతీయస్థానంలో నిలిచింది. స్పోర్ట్స్ సెక్రటరీ మహేశ్, కేవీ రమణ, డీఈ, ఏడీఈ నరసింహారావు, రఘువీర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. బిడ్డా..!

ట్రాక్టర్ కింద పడి పసికందు మృతి

ఇల్లెందు రూరల్, మార్చి 27: ఏడాదిన్నర వయసున్న ఓ పసికందును ట్రాక్టర్ రూపంలో మృత్యువు బలిగొంది. 'ఏడాదిన్నరకే నీకు నూరేళ్లాయుష్షు నిండిందా బిడ్డా..' అంటూ, ఆ కన్న పేగు గుండె పగిలేలా రోదిస్తున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. మండలంలోని బోయితండా గ్రామానికి చెందిన వాంకుడోత్ శ్రీకాంత్-కల్యాణి దంపతులు వ్యవసాయ పనులు చేస్తున్నారు. వారికి ఆర్యన్ ఒక్కడే సంతానం. వీరికి చెందిన ట్రాక్టర్‌ను గురువారం సాయంత్రం సమీప బంధువైన బానోత్ వినోద్.. బయటి నుంచి ఇంట్లోకి తీసుకొచ్చి పెడుతున్నాడు. ఈ క్రమంలోనే, ఏడాదిన్నర వయసున్న చిన్నారి ఆర్యన్.. ఆడుకుంటూ ఆ ట్రాక్టర్ వెనుక వైపుగా వెళ్లాడు. అతడిని డ్రైవర్ వినోద్‌గానీ, తల్లిదండ్రులుగానీ గమనించలేదు. ఆ ట్రాక్టర్ వెనుక భాగం తగలడంతో ఆ చిన్నారి తలకు తీవ్ర గాయాలయ్యాయి. తట్టుకోలేని బాధతో ఆ చిన్నారి ఒక్కసారిగా పెద్దపెట్టున ఏడుస్తుండడంతో తల్లిదండ్రులు, డ్రైవర్ వినోద్ పరుగు పరుగున వచ్చారు. అప్పటికే రక్తమోడుతున్న ఆ చిన్నారి ఆర్యన్(18 నెలలు)ను హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే ఆ చిన్నారి ప్రాణాలొదిలాడు. 'ఏడాదిన్నరకే నీకు నూరేళ్లాయుష్షు నిండిందా బిడ్డా..' అంటూ, ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

ప్రాజెక్ట్ ఇక్కడ.. పారేది అక్కడ..

'సీతారామ' నీటి తరలింపుపై అసెంబ్లీలో ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు, మార్చి 27: ''సీతారామ ప్రాజెక్టు కట్టేదేమో గిరిజన ప్రాంతంలో. నీటిని పారించేది మాత్రం మైదాన ప్రాంతానికి. ఇదెక్కడి న్యాయం..?'' అని, గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోగల సీతారామ ప్రాజెక్టు నుంచి నీళ్లు తమ గిరిజన ప్రాంతానికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ''ఇల్లెందు నియోజకవర్గంలోని రోళ్లపాడు ప్రాజెక్ట్ రిజర్వాయర్‌కు సీతారామ ప్రాజెక్ట్ నీళ్లు అందించడం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు నియోజకవర్గంతోపాటు మహబూబాబాద్, ములుగు జిల్లాలకు సాగు నీరు అందించేందుకు సీతారామ ప్రాజెక్టును గత ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న కోరం కనకయ్య

దీని కాలువ.. చీమలపాడు మీదుగా రోళ్లపాడుకు రావాల్సి ఉందని అన్నారు. కానీ, దానిని జులూరుపాడు వద్ద రూటు మార్చి, మైదానప్రాంతానికి తీసుకెళ్లారని చెప్పారు. దీంతో తమ గిరిజన ప్రాంతాలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. రోళ్లపాడులో రిజర్వాయర్ నిర్మించి, సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మాంసపు వ్యర్థాలను యార్డులోనే వేయాలి

అశ్వారావుపేట టౌన్, మార్చి 27: అశ్వారావుపేట పట్టణంలోని చికెన్, మటన్ షాపుల నిర్వాహకులు మాంసపు వ్యర్థాలను డంపింగ్ యార్డులో మాత్రమే వేయాలని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టీపీవో) శ్రీనివాస రావు చెప్పారు. పట్టణంలోని చికెన్, మటన్ షాపుల నిర్వాహకులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. చికెన్, మటన్ వ్యర్థాలను భద్రాచలం రోడ్డులోని ప్రధాన రహదారి వెంట, దొంతికుంట చెరువు కట్టపై వేస్తుండడంతో దుర్వాసన వస్తున్నదని, ప్రజలు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. ఇక నుంచి ఈ వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌లో మాత్రమే వేయాలని ఆదేశించారు. వ్యాపారులు తమ దుకాణాలను డ్రైనేజీ అవతలనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇదే విషయమై ఇప్పటికే చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులకు, కూరగాయల వ్యాపారులకు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు.

చికెన్ వ్యాపారస్తులతో మాట్లాడుతున్న టీపీవో

ఇల్లెందు 'బార్' అధ్యక్షుడిగా కాంపల్లి

ఇల్లెందు బార్ అసోసియేషన్ నూతన కమిటీ


మణుగూరు బార్ అసోసియేషన్ నూతన కమిటీ

ఇల్లెందు, మార్చి 27: ఇల్లెందు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా కాంపల్లి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కీర్తి కార్తీక్, ఉపాధ్యక్షుడిగా ఖాసిం, సంయుక్త కార్యదర్శిగా సిహెచ్.నవీన్‌కుమార్, కోశాధికారిగా మూడు వినోద్ గెలుపొందారు. ఎన్నికల అధికారులుగా ఎన్.చెన్నకేశవరావు, దంతాల ఆనంద్ వ్యవహరించారు.

'మణుగూరు' అధ్యక్షుడిగా బద్దం

మణుగూరు టౌన్, మార్చి 27: మణుగూరు బార్ అసోసియేషన్‌కు గురువారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్షుడిగా మూడు ఓట్ల తేడాతో బద్దం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా నాలుగు ఓట్ల తేడాతో కవిత గెలుపొందారు. కోశాధికారిగా పనుగంటి పద్మావతి, సహాయ కార్యదర్శిగా గోడిసాల వెంకటరత్నం, మహిళా ప్రతినిధిగా చిర్ర సరస్వతి, లైబ్రేరియన్‌గా గురుకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 42 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారిగా వీర మధుసూదన్, సహాయ అధికారిగా శైలజ వ్యవహరించారు.

బాలికల వసతి గృహం తనిఖీ

వసతి గృహం గదులను పరిశీలిస్తున్న కమిషనర్

ఇల్లెందు, మార్చి 27: స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కనున్న గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తనిఖీ చేశారు. తాగునీటి సరఫరాను, గదులను, మెనూ అమలును పరిశీలించారు. పిల్లలకు తగిన సదుపాయాలు ఉండేలా చూడాలని హాస్టల్ వార్డెన్ సునీతతో అన్నారు.

క్రైస్తవుల నిరసన

నిరసన తెలుపుతున్న పాస్టర్లు

మణుగూరు టౌన్, మార్చి 27: పాస్టర్ ప్రవీణ్ పగడాలను కొట్టి చంపి, రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు గురువారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. దర్యాప్తు జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు విజ్ఞానరావు, శ్యాం, జేమ్స్, శామ్యూల్, నెహెమ్యా తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట ఆసుపత్రికి నలుగురు వైద్యులు

అశ్వారావుపేట, మార్చి 27: స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య నిపుణులు గురువారం విధుల్లో చేరారు. వీరిలో డాక్టర్ మౌనిక (గైనకాలజిస్ట్), డాక్టర్ అన్నపూర్ణ (అనస్థీషియా), డాక్టర్ ప్రకాష్ (పీడియాట్రీ), డాక్టర్ రాకేష్ (ఆర్థోపెడిక్) ఉన్నారు. వీరి సేవలను ప్రజలు ఉపయోగించుకోవచ్చని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధారుక్మిణి ఒక ప్రకటనలోతెలిపారు.

'ఆఫ్ టైప్' సమస్య పరిష్కరించాలని వినతి

ఎంపీ రవిచంద్రతో కలిసి కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దమ్మపేట రూరల్, మార్చి 27: తెలంగాణ ఆయిల్‌ఫెడ్ పరిధిలోని రైతులు ఎదుర్కొంటున్న ఆఫ్ టైప్ పామాయిల్ మొక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ నాయకులు ఢిల్లీలో బుధవారం వినతిపత్రం ఇచ్చారు. 2016 నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు ఆయిల్‌ఫెడ్ పరిధిలోని ఇతర జిల్లాల్లోని రైతులు ఆఫ్ టైప్ మొక్కలతో తీవ్రంగా నష్టపోయారని వివరించారు. తుంబూరు ఉమామహేశ్వర రెడ్డి, పుల్లయ్య, చెలికాని వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'భీమా జ్యువెల్స్'లో ఉగాది ఆఫర్లు

రఘునాథపాలెం, మార్చి 27: భారతదేశంలోనే ప్రముఖ రిటైల్ జ్యువెల్లర్ సంస్థ భీమా జ్యువెల్స్ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ఆఫర్లను కస్టమర్ల ముందుకు తెచ్చింది. ఖమ్మం నగరంలోని భీమా జ్యువెల్స్ వేదికగా బంగారం, వెండి, వజ్రాభరణాలపై అద్భుతమైన ఆఫర్లు, భారీ డిస్కౌంట్లను ప్రకటించింది. బంగారు ఆభరణాలకు మేకింగ్ చార్జీలపై 35 శాతం వరకు తగ్గింపునిస్తోంది. డైమండ్ జ్యువెల్లరీల్లో క్యారెట్‌కు 20 శాతం వరకు తగ్గింపును ప్రకటించింది. వెండి నగలపై కిలోగ్రాముకు ఫ్లాట్ రూ.5 వేలు తగ్గింపు ఇస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ బిందుమాధవ్ పేర్కొన్నారు. ఉగాది సీజన్‌లో కస్టమర్లకు నాణ్యమైన బంగారు, వెండి, వజ్రాభరణాలను అందుబాటులోకి తీసుకరావాలనే ఉద్దేశంతోనే ఈ ప్రత్యేక ఆఫర్లను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారులను కోరారు.

'కేఎల్ఆర్'లో అంతరిక్ష నమూనా ప్రదర్శన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నరేశ్

పాల్వంచ, మార్చి 27: స్థానిక కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో 'కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్స్‌లెన్స్' ఆధ్వర్యంలో గురువారం అంతరిక్ష నమూనా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన అతిథిగా కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్స్‌లెన్స్ వ్యవస్థాపకుడు నరేశ్ ఇండియన్, ముఖ్య అతిథిగా జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతి రాజు హాజరయ్యారు. ఈ ప్రదర్శనలో 40కి పైగా అంతరిక్ష రక్షణ నమూనాలు ప్రదర్శించారు. విద్యార్థులకు నరేశ్ ఇండియన్ అవగాహన కల్పించారు. డైరెక్టర్లు సిద్ధార్థరెడ్డి, మురళీ ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, పలు కాలేజీల ప్రిన్సిపాళ్లు పురుషోత్తమ్, సుమన్, నర్సింహారావు, సుమతి పాల్గొన్నారు.

సింగరేణి నర్సింగ్ కాలేజీ నూతన భవనాల పరిశీలన

నర్సింగ్ కాలేజీ భవనాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్లు

కొత్తగూడెం సింగరేణి, మార్చి 27: సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో నూతనంగా నిర్మించిన సింగరేణి నర్సింగ్ కాలేజీ భవనాన్ని, సింగరేణి ప్రధాన ఆస్పత్రిని సంస్థ డైరెక్టర్ (పా) వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. భవన విశేషాలు, కళాశాల వివరాల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. వసతులు, కోర్సుల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. సింగరేణి కీర్తిని ఇనుమడింపజేసేలా సేవలను మెరుగు పర్చేందుకు కృషిచేయాలని సూచించారు. సింగరేణి ఉన్నతాధికారులు సుజాత, కవితానాయుడు, ఉష, సునీల, రాజశేఖర్, శ్రీనివాస్, మేట్రన్ మిస్ శాలే తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ మృతికి పాస్టర్ల సంతాపం

పాల్వంచ, మార్చి 27: ఏపీలోని రాజమండ్రి సమీపంలో ఈ నెల 25న అకాల మరణం పొందిన పాస్టర్ ప్రవీణ్ పగడాలకు పాల్వంచ మండల పాస్టర్స్ కమిటీ బాధ్యులు సంతాపం తెలిపారు. ఈ మేరకు స్థానిక యూసీఎఫ్ హాల్లో గురువారం నిర్వహించిన సంతాప సభలో వారు ప్రార్థనలు చేశారు. ప్రవీణ్ పగడాల మరణం విషయంలో ఉన్న అనేక సందేహాలను నివృత్తి చేసేందుకు న్యాయ విచారణ జరిపించాలని కోరారు.

వ్యక్తి ఆకస్మిక మృతి

టేకులపల్లి, మార్చి 27: మండలంలో గురువారం ఓ వ్యక్తి ఆకస్మికంగా మృతిచెందాడు. ఎస్సై పోగుల సురేష్ తెలిపిన వివరాలు.. ఏపీ రాష్ట్రం వత్సవాయి మండలం ఖమ్మంపాడు గ్రామస్తుడు బండి రామకృష్ణ(50), టేకులపల్లి మండలం బొమ్మనపల్లి పంచాయతీ కారుకొండ క్రాస్ రోడ్ వద్దనున్న జామయిల్ యార్డు వద్దకు గురువారం మధ్యాహ్నం వచ్చాడు. అక్కడ కాసేపు పడుకున్నాడు. ఒక్కసారిగా లేచి కూర్చుని, తనకు ఊపిరి ఆడడం లేదని చుట్టుపక్కల ఉన్న ఆరితో చెప్పి పడిపోయాడు. ఈ సమాచారంతో 108 సిబ్బంది వచ్చి పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. అతని వద్దనున్న సెల్‌ఫోన్ ఆధారంగా చిరునామాను పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని కొత్తగూడెం ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

కరకగూడెం, మార్చి 27: క్షణికావేశంలో ఆత్మహత్యకు యత్నించిన యువకుడు గురువారం మృతిచెందాడు. ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాలు.. మండలంలోని మోతే గ్రామస్తుడు నైనారపు సాగర్(30), ఇటీవల తన కుటుంబీకులతో గొడవపడి, క్షణికావేశంలో పురుగుల మందు తాగాడు. ఆయనను కుటుంబీకులు 108 వాహనంలో మణుగూరు ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అతడు అక్కడే గురువారం మృతి చెందాడు. ఆయన భార్య నాగేంద్ర ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్ఐ రాజేందర్ దర్యాప్తు చేస్తున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సంక్షిప్తం

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, మార్చి 27: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామి వారికి నిత్య కల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణం, నిత్య పూజలు చేశారు.

మాజీ వైస్ ఎంపీపీకి నివాళి

టేకులపల్లి, మార్చి 27: మాజీ వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మండలంలోని సులానగర్‌లోగల స్వగృహంలో గురువారం ఆయన దశ దిన కార్యక్రమానికి మాజీ సర్పంచ్ కోరం సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్ హాజరయ్యారు. చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. పార్టీ నాయకులు కోరం ఉమ, కుమ్మరి కిరణ్ కుమార్, మాలోత్ పూల్‌సింగ్, సురేష్, పృథ్వి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

ఇల్లెందు రూరల్, మార్చి 27: మండలంలోని రాజీవ్ నగర్ గుడిసె వాసులు.. తమ నివాస ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్న డిమాండుతో సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం మూడోరోజుకు చేరాయి. నాయకులు అలేటి కిరణ్, అబ్దుల్ నబీ, కృష్ణ, మన్యం మోహన్ రావు, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

భద్రాచలం, మార్చి 27: చెల్లని చెక్కు కేసులో నేరస్తుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ గురువారం తీర్పునిచ్చారు. భద్రాచలానికి చెందిన పోతురాజు రామారావు నుంచి అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ ఉద్యోగి చిద్దిరాల గోవర్ధన్ అప్పు తీసుకున్నారు. ఈ అప్పును చెల్లిస్తున్నట్లుగా 2013 జనవరి 18న చెక్కు ఇచ్చాడు. అది బ్యాంకులో చెల్లకపోవడంతో కోర్టును పోతు రామారావు ఆశ్రయించారు. నేరం రుజువవడంతో చిద్దిరాల గోవర్ధన్‌కు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.8లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి గురువారం తీర్పునిచ్చారు. ఫిర్యాదుదారు రామారావు తరపున న్యాయవాదులు ఎంవి.రమణారావు, దన్నన రాములు వాదించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

మణుగూరు టౌన్, మార్చి 27: ఆర్టీసీ మణుగూరు డిపో పరిధిలోని ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు శుక్రవారం 'డయల్ యువర్ డీఎం' నిర్వహించనున్నట్లు డీఎం శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3.00 నుంచి 4.00 గంటల వరకు 99592 25963 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని వివరించారు.

ఆలయానికి నిధులు.. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

భద్రాచలం, మార్చి 27: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం రూ.35 కోట్లు విడుదల చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఇల్లెందు, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారె ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయ గ్రామంలో వైద్య శిబిరం

టేకులపల్లి, మార్చి 27: మండలంలోని చింతోనిచెలక పంచాయతీ నాగారం జోగు గొత్తికోయ గ్రామంలో గురువారం వైద్య శిబిరాన్ని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ నిర్వహించారు. రక్త పరీక్షలు నిర్వహించి, చికిత్స చేసి మందులు ఇచ్చారు. మలేరియా, క్షయ వ్యాధులపై, మహిళల్లో రక్తహీనత లోపంతో వచ్చే అనర్థాలపై పోషకాహార లోపంతో వచ్చే వ్యాధులపై, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆరోగ్య విస్తరణాధికారి దేవ, సూపర్‌వైజర్ పోరండ్ల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు ధనసరి రాంబాబు, రమేష్ బాబు, ఆశా కార్యకర్త సుగుణ తదితరులు పాల్గొన్నారు.

దారి.. దారుణం..

గౌరారం బ్రిడ్జి వద్ద గుంతలమయంగా మారిన తారు రోడ్డు

పర్ణశాల, మార్చి 27: దుమ్ముగూడెం మండలం నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళ్లే ప్రధాన రహదారి పెద్ద నల్లబెల్లి-పైడిగూడెం గ్రామాల మధ్య అడుగడుగునా గుంతలతో దారుణంగా తయారైంది. పెద్ద నల్లబెల్లి నుంచి గౌరారం, కె.లక్ష్మీపురం, పైడిగూడెం, చింతగుప్ప, సుజ్ఞాపురం, తోగ్గూడెం మీదుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళ్లేందుకే ఇదే ప్రధాన రహదారి. ఈ మార్గంలో సుమారు ఎనిమిది కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా వరకు రాకపోకలకు కూడా ఇదే దారి. రాత్రి పూట ఈ మార్గంలో ప్రయాణం నరకాన్ని తలపిస్తున్నది. గుంతలను పూడ్చాలని ఇక్కడి ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సంబంధిత అధికారుల్లో ఏమాత్రం చలించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.